నమస్తే తెలంగాణ
భద్రాద్రి కొత్తగూడెం
5 | ఖమ్మం, ఆదివారం 21 ఏప్రిల్ 2024 | BHADRADRI KOTHAGUDEM

వ్యవసాయ బావిలో అడుగంటిన భూగర్భ జలం

ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలంలోని పిండిప్రోలుకు చెందిన రైతులు పరికపల్లి వెంకటేశ్వర్లు, బుచ్చిరాములు ఊరచెరువు బావి కింద యేటా నాలుగు ఎకరాల్లో వరి పాలం సాగు చేస్తున్నారు. వానకాలం, యాసంగిలో 34 పుట్ల వడ్లు పండేవి. ఈ ఏడాది యాసంగిలో వరిసాగు చేయగా.. బావిలో నీళ్లు సరిపోలేదు. చెరువులో నీళ్లులేక బావిలో భూగర్భ జలాలు అడుగంటాయి. నీళ్లు సరిపడక రెండు ఎకరాలు పాట్టకొచ్చిన పాలం నిలువునా ఎండిపోయింది. మరో రెండు ఎకరాలు వరుస తడులు తిప్పుతున్నా సగం పంట కూడా చేతికొచ్చే పరిస్థితి లేదు. ఇది వెంకటేశ్వర్లు, బుచ్చిరాములు పరిస్థితే కాదు. టీ.పాలెం మండలంలోని అన్ని గ్రామాల్లో రైతుల పరిస్థితి ఇలాగే ఉంది. అన్నదాతలు లేకుంటే ప్రతి ఒక్కరూ 'అన్నమో రామచంద్రా' అంటూ ఏడవాల్సిందే.. అయితే ఇక్కడ పంటలు పండించేందుకు నీళ్లు లేక రైతులే 'నీళ్లో రామచంద్రా' అంటూ మొత్తుకుంటున్నారు.

- తిరుమలాయపాలెం, ఏప్రిల్ 20

ఎండిపోయిన వరి పాలంలో పశువులు మేపుతున్న రైతు వెంకటేశ్వర్లు

నీళ్లో రామచంద్రా..

- వ్యవసాయ బావుల్లో అడుగంటిన భూగర్భ జలాలు
- ఎండిపోతున్న పాలాల్లో పశువులను మేపుతున్న రైతులు
- తిరుమలాయపాలెం మండలంలో పరిస్థితి దయనీయం
- పాతరోజులొచ్చాయని అన్నదాతల ఆవేదన
- 'భక్తరామదాసు' ద్వారా నీళ్లివ్వలేదని కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆగ్రహం

రెండు పంటలు పండిన మాగాణి పొలాలు నేడు నీళ్లులేక నెర్రెలు బారాయి. పొట్టకొచ్చిన పొలాలు నిలువునా ఎండిపోవడంతో గత్యంతరం లేక పశువులను మేపుతున్నారు. పెట్టిన పెట్టుబడులు సైతం నష్టపోయి అప్పులపాలు కావాల్సి వచ్చిందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ తర్వాత బీఆర్ఎస్ ప్రభుత్వం తిరుమలాయపాలెం మండలంలో భక్తరామదాసు ఎత్తిపోతల పథకాన్ని నిర్మించింది. కరువు నేలల్లో కృష్ణా జలాలు పారించి ఈ ప్రాంతాన్ని కోనసీమగా మార్చింది. భక్తరామదాసు ఎత్తిపోతల పథకం ద్వారా చెరువులు, కుంటలు నింపారు. దీంతో భూగర్భ జలాలు పెరిగి బావులు, బోర్ల కింద కూడా సాగు విస్తీర్ణం పెరిగింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే మళ్లీ పాతరోజులొచ్చాయి. ఈ ఏడాది భక్తరామదాసు లిఫ్ట్ ద్వారా చెరువులు, కుంటలు నింపలేదు. దీంతో బావులు, బోర్లలో భూగర్భ జలాలు అడుగంటాయి. కాంగ్రెస్ ప్రభుత్వం చేతగానితనం వల్లనే పంటలు ఎండిపోయి కరువు పరిస్థితులు ఏర్పడ్డాయని అన్నదాతలు అభిప్రాయపడుతున్నారు.

మళ్లీ పాతరోజులొచ్చాయి..

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో శ్రీభక్తరామదాసు లిఫ్ట్ ద్వారా చెరువులు నింపారు. బావులు, బోర్లలో పుష్కలంగా నీరుండి వానకాలం, యాసంగిలో వరి సాగు చేశాం. పుష్కలంగా పంట పండింది. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చింది మళ్లీ పాతరోజులొచ్చాయి. ఈ ఏడాది భక్తరామదాసు లిఫ్ట్ ద్వారా చెరువులు నింపలేదు. దీంతో బావులు, బోర్లలో నీరులేకుండా పోయింది. యాసంగి వరి పొలాలు నిలువునా ఎండిపోయాయి. నేను రెండు ఎకరాలు పొలం సాగు చేసి రూ.60 వేలు పెట్టుబడి పెట్టాను. నీళ్లు లేక పొట్టదశలో పొలం నిలువునా ఎండిపోగా పశువులను మేపాను.

– పరికపల్లి వెంకటేశ్వర్లు, రైతు, పిండిప్రోలు

మాట్లాడుతున్న ఎంపీ నామా నాగేశ్వరరావు, పక్కన ఎంపీ వద్దిరాజు, ఎమ్మెల్సీ తాతా మధు

మోసాల కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలి

- పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ఓటేద్దామని నిర్ణయించుకున్న ప్రజలు
- అందరూ కష్టపడి పనిచేస్తే విజయం మనదే : బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి నామా నాగేశ్వరరావు
- ఏన్కూరు, జూలూరుపాడు ముఖ్య కార్యకర్తల సమావేశంలో రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ తాతా మధు, మాజీ ఎమ్మెల్యే బానోతు మదన్‌లాల్

వైరాటౌన్, ఏప్రిల్ 20 : అలవికాని హామీలు ఇచ్చి రాష్ట్రంలో గద్దెనెక్కి మోసాలకు పాల్పడుతున్న కాంగ్రెస్‌కు పార్లమెంట్ ఎన్నికల్లో ఓటుతో తగిన గుణపాఠం చెప్పాలని బీఆర్ఎస్ ఖమ్మం ఎంపీ అభ్యర్థి నామా నాగేశ్వరరావు అన్నారు. ఏన్కూరులోని ఓ కల్యాణ మండపంలో బీఆర్ఎస్ పార్టీ ఏన్కూరు, జూలురుపాడు మండలాల ముఖ్య కార్యకర్తల సమావేశం శనివారం జరిగింది. ఈ సందర్భంగా నామా మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓటు వేసి పొరపాటు చేశామని గ్రహించిన ప్రజలు పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ఓటు వేద్దామని ఎదురు చూస్తున్నారని అన్నారు. ప్రజలతో మమేకమై బూత్‌స్థాయిలో నాయకులు, కార్యకర్తలు కష్టపడి పనిచేస్తే విజయం మనదేనన్నారు. అంబేద్కర్ జయంతి నాడు ఆయన విగ్రహానికి కనీసం పూలదండ కూడా వేయలేదని, అలాంటి కాంగ్రెస్‌కు పార్లమెంట్ ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలన్నారు. రూ.8 వేల కోట్ల విలువైన జాతీయ రహదారులను తీసుకొచ్చానని గుర్తు చేశారు. పార్లమెంట్ సమావేశాలకు ఎక్కువ రోజులు హాజరై ఎక్కువ ప్రశ్నలు అడిగిన రికార్డు తనదేని నామా పేర్కొన్నారు.

కాంగ్రెస్‌ను ఓడించాలి : మాజీ ఎమ్మెల్యే బానోతు మదన్‌లాల్

గత ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనలో రాష్ట్రం సుభిక్షంగా ఉంటే.. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కరువు తీసుకొచ్చిందని, ఇలాంటి కాంగ్రెస్‌కు పార్లమెంట్ ఎన్నికల్లో ఓటుతో బుద్ధి చెప్పాలని పార్టీ వైరా నియోజకవర్గ ఇంఛార్జి, మాజీ ఎమ్మెల్యే బానోతు మదన్‌లాల్ అన్నారు. అభివృద్ధిలో దేశంలోనే నెంబర్ వన్‌గా ఉన్న తెలంగాణ రాష్ట్రాన్ని సంక్షోభంలోకి నెట్టారని, ఇచ్చిన హామీలను గాలికి వదిలేశారన్నారు. సమావేశంలో జూలూరుపాడు జడ్పీటీసీ భూక్యా కళావతి, జిల్లా నాయకులు యల్లంకి సత్యనారాయణ, పోలుదాసు కృష్ణమూర్తి, రైతు నాయకులు యదళ్లపల్లి వీరభద్రం, చావా వెంకటరామారావు, ఏన్కూరు జడ్పీటీసీ బాదావత్ బుజ్జి, ఎంపీటీసీలు వాసిరెడ్డి మోహన్‌రావు, బానోతు సరోజిని, మండల నాయకులు ఇంజం పుల్లయ్య, కొనకంచి వెంకటేశ్వర్లు, యండ్రాతి మోహన్‌రావు, పొన్నం హరికృష్ణ, వైరా మండల పార్టీ అధ్యక్షుడు బాణాల వెంకటేశ్వరరావు, మోరంపూడి ప్రసాద్, నామా సేవా సమితి నుంచి పాల్వంచ రాజేశ్, చీకటి రాంబాబు, సరిపూడి గోపి, కృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నామా విజయానికి కృషి చేయాలి : రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర

పార్లమెంట్ ఎన్నికల్లో నాయకులు, కార్యకర్తలు బాధ్యతగా పనిచేసి ఎంపీగా నామా నాగేశ్వరరావు విజయానికి కృషి చేయాలని రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర అన్నారు. అందరూ కష్టపడి పని చేస్తే నామాకు 2 లక్షల మెజార్టీ ఖాయమన్నారు. పదేళ్ల కాలంలో కేసీఆర్ చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి ఇంటింటికి తిరిగి వివరిస్తూ ఓట్లు అభ్యర్థించాలన్నారు. నామా కష్టజీవి అని, ఆయన గెలిస్తే ప్రజలకు న్యాయం జరుగుతుందన్నారు.

కాంగ్రెస్‌వి 420 హామీలు : ఎమ్మెల్సీ తాతా మధు

420 హామీలతో ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్‌కు పార్లమెంట్ ఎన్నికల్లో ఓటుతో బుద్ధి చెప్పాలని బీఆర్ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధు అన్నారు. రాష్ట్ర ప్రయోజనాలు, ప్రజల హక్కులు కాపాడాలంటే నామాను అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. రాష్ట్రంలో 8 పార్లమెంట్ స్థానాలను బీఆర్ఎస్ పార్టీ గెలవబోతుందని, మరో 4 స్థానాల్లో గట్టి పోటీ ఇస్తుందన్నారు. పదేళ్లు కేసీఆర్ అభివృద్ధితో సుభిక్ష రాష్ట్రంగా మారిస్తే.. కాంగ్రెస్ వచ్చి సంక్షోభంలోకి నెట్టిందన్నారు.

వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

ఖమ్మం కలెక్టర్ వీపీ గౌతమ్

వడదెబ్బ జాగ్రత్తల సూచన పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్

ఖమ్మం/ఖమ్మం సిటీ, ఏప్రిల్ 20 : ఉష్ణోగ్రతలు పెరుగుతున్న దృష్ట్యా ప్రజలు వడదెబ్బ తగలకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, అత్యవసర పనులు ఉంటేనే జాగ్రత్తలు పాటిస్తూ బయటకు రావాలని ఖమ్మం కలెక్టర్ వీపీ గౌతమ్ అన్నారు. కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో వడదెబ్బ నుంచి రక్షణ సూచనలపై రూపొందించిన పోస్టర్‌ను కలెక్టర్ శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎండ తీవ్రత వల్ల ఉదయం 11 నుంచి సాయంత్రం 4 గంటల మధ్యలో అత్యవసరమైతే తప్ప ఎండలో తిరగొద్దన్నారు. చిన్నారులు, వయో వృద్ధులు ఇంటికే పరిమితం కావాలని, ఎప్పటికప్పుడు సరిపడా నీరు తాగాలన్నారు. వదులుగా ఉన్న దుస్తులు, బయటికి వెళ్లేటప్పుడు గొడుగు, టోపీ, సన్నని లేత రంగు వస్త్రాలను ధరించాలన్నారు. ఎండలో పనిచేసే కార్మికులు తరచుగా నీటితోపాటు ఓఆర్ఎస్ ద్రావణాన్ని తీసుకోవాలన్నారు. వంట గదిలోకి గాలి, వెలుతురు వచ్చేలా తలుపులు, కిటికీలు తెరిచి ఉంచాలన్నారు. ఆల్కహాల్, కాఫీ, కార్బోనేటెడ్ శీతల పానీయాలను తగ్గించాలన్నారు. అధిక మాంసకృత్తులు కలిగిన ఆహారాన్ని, నిల్వ ఉంచిన పదార్థాలను తినొద్దన్నారు. ఆర్టీసీ బస్సుల్లో వడదెబ్బ నుంచి రక్షణ సూచనలతో రూపొందించిన పోస్టర్లను ప్రదర్శించాలని అధికారులను ఆదేశించారు. దీనిపై బస్సు డ్రైవర్లు, కండక్టర్లకు అవగాహన కల్పించాలన్నారు. అధిక చమట, దాహం, బలహీనత, తల తిప్పడం, కండరాలు పట్టేయడం వంటి లక్షణాలు కనిపిస్తే వడదెబ్బగా భావించి సమీపంలోని పీహెచ్‌సీకి తీసుకెళ్లాలని, లేదా 108కు ఫోన్ చేయాలని కలెక్టర్ సూచించారు. ప్రతి గ్రామంలోని ఆశ, ఏఎన్ఎంల వద్ద, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఓఆర్ఎస్ ద్రావణం అందుబాటులో ఉంచామన్నారు. పీహెచ్‌సీల్లో ఓఆర్ఎస్‌తోపాటు ఐవీ ఫ్లూయిడ్స్ సరిపడా ఉన్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ బి.మాలతి, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సైదులు, ఆర్టీసీ డిప్యూటీ ఆర్ఎం పవిత్ర, ఎస్డీపీవో నీలోహన, పలువురు అధికారులు పాల్గొన్నారు.

ఖమ్మంలో రెండు నామినేషన్లు దాఖలు

నామినేషన్ దాఖలు చేస్తున్న బాజీబాబా

ఖమ్మం, ఏప్రిల్ 20 : ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గంలో ఎంపీ అభ్యర్థుల నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ కొనసాగుతున్నదని, శనివారం రెండు నామినేషన్లు దాఖలైనట్లు ఖమ్మం పార్లమెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ వీపీ గౌతమ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో స్వతంత్ర అభ్యర్థిగా షేక్ బాజీబాబా ఒక సెట్ నామినేషన్ పత్రాలు దాఖలు చేయగా.. ఆదార్ పార్టీ తరపున కుక్కల నాగయ్య రెండో సెట్ నామినేషన్ పత్రాలు దాఖలు చేశారని పేర్కొన్నారు.

హామీలను వెంటనే అమలు చేయాలి

పోస్టుకార్డు ఉద్యమాన్ని ప్రారంభిస్తున్న ఎంపీలు నామా, వద్దిరాజు, మాజీ మంత్రి పువ్వాడ, ఎమ్మెల్సీ తాతా మధు

- కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసిన బీఆర్ఎస్ నాయకులు
- పోస్టుకార్డు ఉద్యమాన్ని ప్రారంభించిన ఎంపీలు వద్దిరాజు, నామా, మాజీ మంత్రి పువ్వాడ, ఎమ్మెల్సీ తాతా మధు

మాట్లాడుతున్న బీఆర్ఎస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు

ఖమ్మం, ఏప్రిల్ 20 : అధికారంలోకి వస్తే రూ.2 లక్షల రైతు రుణమాఫీ, రైతుబంధు రూ.15 వేలు, పింఛన్ రూ.4 వేలు, వరి క్వింటాల్‌కు రూ.500 బోనస్ చెల్లిస్తామని కాంగ్రెస్ నాయకులు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని బీఆర్ఎస్ నేతలు డిమాండ్ చేశారు. పార్టీ అధినేత కేసీఆర్ పిలుపు మేరకు ఖమ్మం నగరంలోని తెలంగాణ భవన్‌లో శనివారం రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, పార్లమెంట్ అభ్యర్థి నామా నాగేశ్వరరావు, మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తాతా మధు, పార్టీ సీనియర్ నాయకుడు బొమ్మెర రామ్మూర్తి తదితరులతో కలిసి పోస్టుకార్డు ఉద్యమాన్ని ప్రదర్శించి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు జై తెలంగాణ.. జైజై తెలంగాణ.. వర్ధిల్లాలి వర్ధిల్లాలి కేసీఆర్ నాయకత్వం వర్ధిల్లాలి.. అని నినాదాలు చేశారు. రైతు రుణమాఫీ, రైతుబంధు రూ.15 వేలు, రూ.500 బోనస్, పింఛన్లను రూ.4వేలకు పెంచుతామన్న హామీలను వెంటనే అమలు పర్చాలంటూ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

'పోస్టు కార్డు' ఉద్యమంలో పాలుపంచుకోవాలి

బీఆర్ఎస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు, పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు

మణుగూరుటౌన్, ఏప్రిల్ 20 : ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ చేపట్టనున్న పోస్ట్ కార్డు ఉద్యమంలో రైతులందరూ భాగస్వాములు కావాలని బీఆర్ఎస్ పార్టీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడు, పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు పిలుపునిచ్చారు. శనివారం రైతుల సమస్యలను ప్రభుత్వానికి తెలియజేసేందుకు మణుగూరు మండలంలో రైతుల సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని, 24 గంటల విద్యుత్ అందిస్తామని, రైతుబంధు పథకం కింద రూ.15 వేలు, కౌలు రైతులకు రూ.12 వేలు, వరి ధాన్యానికి రూ.500 బోనస్ ఇస్తామని హామీలు ఇచ్చి.. ఇప్పటివరకు అమలు చేయలేదన్నారు. ఇచ్చిన హామీలపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీసేందుకు ప్రతి రైతు డిమాండ్లతో కూడిన పోస్టుకార్డులను 'సీఎం రేవంత్‌రెడ్డి, తెలంగాణ సెక్రటేరియట్ హైదరాబాద్'కు పంపించాలని కోరారు. రైతులు అధిక సంఖ్యలో భాగస్వాములై విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

తుమ్మలపై దాడి చేయాల్సిన అవసరం పువ్వాడకు లేదు

- కాంగ్రెస్ నాయకులు అసత్య ఆరోపణలు మానుకోవాలి
- పువ్వాడ కుటుంబ చరిత్ర.. తెరిచిన పుస్తకం
- బీఆర్ఎస్ నాయకులు పగడాల, నీరజ, కూరాకుల, బొమ్మెర

సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

ఖమ్మం, ఏప్రిల్ 20 : మంత్రి తుమ్మల నాగేశ్వరరావుపై దాడి చేయాల్సిన అవసరం మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్‌కు లేదని, కాంగ్రెస్ నాయకులు చేస్తున్న అసత్య ఆరోపణలు మానుకోవాలని బీఆర్ఎస్ నేతలు హెచ్చరించారు. శనివారం ఖమ్మం నగరంలోని బీఆర్ఎస్ జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మేయర్ పునుకొల్లు నీరజ, ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు పగడాల నాగరాజు, డీసీసీబీ మాజీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, కార్పొరేటర్లు షేక్ మక్బూల్, దండా జ్యోతిరెడ్డి, సుడా మాజీ చైర్మన్ బచ్చు విజయ్‌కుమార్, మైనార్టీ అధ్యక్షుడు తాజ్‌ఉద్దీన్, ఉద్యమకారుడు బొమ్మెర రామ్మూర్తి, పగడాల నరేందర్, లీగల్ సెల్ నాయకుడు మేకల సుగుణారావు కాంగ్రెస్ ఆరోపణలను తీవ్రంగా ఖండించారు. ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చలేక వారిని తప్పుదోవ పట్టించేందుకే కాంగ్రెస్ నేతలు అబద్ధపు ప్రచారాలు చేస్తున్నారని అన్నారు. పువ్వాడ కుటుంబం ఐదు దశాబ్దాలుగా ప్రజల మన్ననలను పొందుతున్నదని, వారి కుటుంబం తెరిచిన పుస్తకమని, అటువంటి కుటుంబంపై బురదజల్లే ప్రయత్నాలు చేయడం దుర్మార్గపు చర్యగా పేర్కొన్నారు. పత్రికలో వచ్చిన నిరాధారమైన వార్తను పట్టుకుని కాంగ్రెస్ నాయకులు పువ్వాడపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. జిల్లాలో కడప, రాయలసీమ హత్యా రాజకీయాలకు అవకాశం లేదన్నారు. అనవసరంగా పువ్వాడపై ఆరోపణలు చేస్తే ఊరుకునేదిలేదని హెచ్చరించారు.

అభ్యర్థుల ఖర్చుల వివరాలు విధిగా నమోదు చేయాలి

వ్యయ పరిశీలకుడు శంకర్ నంద మిశ్రా

కలెక్టర్‌తో మాట్లాడుతున్న జిల్లా వ్యయ పరిశీలకుడు

భద్రాద్రి కొత్తగూడెం, ఏప్రిల్ 20 (నమస్తే తెలంగాణ): లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థుల ఖర్చులు విధిగా నమోదు చేయాలని వ్యయ పరిశీలకుడు శంకర్ నంద మిశ్రా అన్నారు. శనివారం జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ ప్రియాంక ఆలతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ... లోక్‌సభ ఎన్నికల అభ్యర్థులు నామినేషన్ వేసిన నాటి నుంచి పోలింగ్ జరిగే వరకు ప్రతీ రూపాయి ఖర్చును వ్యయ పరిశీలకుల బృందాలు నమోదు చేయాలన్నారు. అన్ని బృందాలు సమన్వయంతో పనిచేయాలన్నారు. బ్యాంకు ఖాతాలను, డిజిటల్ లావాదేవీలను తనిఖీ చేయాలన్నారు. ర్యాలీలు, సమావేశాలు జరిగినప్పుడు ఎన్నికల సంఘం నిర్ణయించిన ధర ప్రకారం ఖర్చు నమోదు చేయాలన్నారు.

నేత్రపర్వంగా తెప్పోత్సవం

రాత్రికి చోరోత్సవం నిర్వహించిన అర్చకులు

రామయ్యకు తెప్పోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం, ఏప్రిల్ 20 : భద్రాచలం రామాలయంలో వసంతపక్ష ప్రయుక్త శ్రీరామ నవమి తిరు కల్యాణ నవాహ్నిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం సాయంత్రం నూతన దంపతులైన సీతారాములకు గోదావరి నదిలో తెప్పోత్సవం కార్యక్రమాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. ఉదయం స్వామివారి ఉత్సవమూర్తులకు బేడా మండపంలో స్నపన తిరుమంజనం, అంతరాలయంలోని మూలవరులకు స్వర్ణ తులసి పూజలు చేశారు. సాయంకాలపు ఆరాధన తర్వాత సీతారాములను అందంగా అలంకరించి ప్రత్యేక పల్లకిలో ఆసీనులను చేసి గోదావరి తీరానికి తీసుకొచ్చారు. ముస్తాబు చేసిన నావపై స్వామివారి ఉత్సవమూర్తులను ఆసీనులను చేసి ముందుగా గోదావరి మాతకు గంగ పూజ చేశారు. పసుపు, కుంకుమ, పట్టు చీర, జాకెట్, గాజులు తదితర పూజా ద్రవ్యాలను గోదావరి మాతకు సమర్పించి.. గోదావరిలోని చేపలకు ఆహారంగా మరమరాలను వేశారు. స్వామివారికి చక్కెర పొంగలిని నైవేద్యంగా సమర్పించి నది మధ్యలో ఐదుసార్లు ప్రదక్షిణ(జల విహారం) చేయించారు. అనంతరం స్వామి వారిని ఆలయానికి తీసుకొచ్చి రాత్రికి చోరోత్సవం నిర్వహించారు. స్వామివారిని అశ్వ వాహనంపై ఆసీనులను చేయగా.. సీతమ్మ వారిని, లక్ష్మణ స్వామిని మరో వాహనం, తిరుమంగైఆళ్వార్‌ను మరో వాహనంపై వేంచేపు చేసి చోరోత్సవం జరిపారు. కార్యక్రమంలో దేవస్థానం అధికారులు, అర్చకులు పాల్గొన్నారు.

పర్ణశాలలో దొంగల దోపోత్సవం

పర్ణశాల, ఏప్రిల్ 20 : నవమి వేడుకల్లో భాగంగా పర్ణశాల రామాలయంలో దొంగల దోపోత్సవం కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు మాట్లాడుతూ సీతారాముల కల్యాణ మహోత్సవం తర్వాత గౌతమీ నది తీరాన తెప్పోత్సవం నిర్వహిస్తామని, ఆ తర్వాత సీతారాముల వారు ఆలయంలోకి ప్రవేశిస్తుండగా మార్గంమధ్యలో దొంగలు వారి వద్ద నుంచి నగలు దోచుకునే కార్యక్రమాన్ని కళ్లకు కట్టినట్లు భక్తులకు వివరించారు. కార్యక్రమంలో అర్చకులు, అధికారులు పాల్గొన్నారు.

పర్ణశాలలో తెప్పోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు